క్లుప్తంగా

ఘనంగా పారాయణలు



ఏలేశ్వరంలో గీతాపారాయణ చేస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు, మహిళలు

ఏలేశ్వరం: స్థానిక మార్కెట్ వీధిలో వేంచేసిన రూపులమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం మహిళలు భగవద్గీత విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. విశ్వహిందూ పరిషత్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరిటీ ఆధ్వర్యంలో మహిళలు ఈ పారాయణతో పాటు లక్ష్మీఅష్టకం, గోవింద నామాలు పఠించారు. పలువురు భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణంలో స్వామి, అమ్మవార్లు

ఏలేశ్వరం: పట్టణంలో వేంచేసిన అనంతలక్ష్మీ సమేత సత్యనారాయణస్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రం 'మఖ'ను పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పొన్నూరు సత్యనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు విశేష అలంకరణ చేశారు.అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కేజ్రీవాల్ అరెస్టు అప్రజాస్వామికం

ప్రత్తిపాడు రూరల్: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు అప్రజాస్వామికమని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు బుగత బంగార్రాజు అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎక్సైజ్ కుంభకోణంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేయడాన్ని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. అరెస్టు చేసిన కేజ్రీవాల్, హేమంత్ సోరెన్, మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్ తదితర ప్రతిపక్ష నాయకులను తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రతిపక్షాలపై అక్రమ కేసులు పెట్టి అణచివేయాలని చూస్తోందని ఆయన విమర్శించారు.

టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి రాజీనామా



విలేకర్ల సమావేశంలో మాట్లాతున్న టీడీపీ నేత లెక్కల భాస్కర్

కోటనందూరు: టీడీపీకి ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి లెక్కల భాస్కర్ రాజీనామా చేశారు. ఈ మేరకు శక్రవారం పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడికి రాజీనామా పత్రాన్ని పోస్టులో పంపించారు. ఈ సందర్భంగా మండలంలోని జగన్నాథపురంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పార్టీకి వీరవిధేయుడిగా సీనియర్ల సహాయ సహకారాలతో నిజాయితీగా పని చేశానన్నారు. 2014లో టీడీపీ అధికారం కోల్పోయిన తరువాత జరిగిన జెడ్పీటీసీ ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసినా తన కుటుంబ సభ్యురాలిని పోటీలో నిలబెట్టానన్నారు. కార్యకర్తలు, నాయకులకు అనుసంధానంగా ఉంటూ, యువతను ప్రోత్సహిస్తూ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశానన్నారు. కాగా ఇటీవల కొన్ని వలస పక్షులు తుని నియోజకవర్గ టీడీపీలో చేరి అధిష్టానాన్ని తప్పుదారి పట్టిస్తున్నాయన్నారు. పార్టీలో కష్టపడి పని చేసేవారిని అవమాన పరుస్తూ ఇబ్బందికరంగా ప్రవర్తించడం వల్ల నిజాయితీగా పని చేసే కార్యకర్తలకు న్యాయం చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. పార్టీ తీరు పట్ల విసుగు చెంది తన అనుచరులతో కలిసి మూకుమ్మడిగా రాజీనామా చేస్తున్నట్లు భాస్కర్ ప్రకటించారు.

ప్రత్తిపాడులో సమన్వయ కమిటీ సమావేశం

ప్రత్తిపాడు రూరల్: ప్రత్తిపాడు టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఎన్డీఏ కూటమి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి అభ్యర్థి సత్యప్రభ విజయానికి టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల శ్రేణులు కష్టించి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్డీఓ కూటమి నేతలు చిలుకూరి రామ్‌కుమార్, వరుపుల తమ్మయ్య బాబు తదితరులు పాల్గొన్నారు.

అపరాలు అధరహో

- మార్కెట్‌లో ఆశాజనకంగా ధర
- మెట్టలో మినుము, పెసర సాగులో దండిగా దిగుబడులు
- కనీస మద్దతు ధరపై హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



జగన్నాథపురంలో అపరాల పంట నూర్పిడి చేస్తున్న రైతులు

కోటనందూరు: మెట్టలో తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడులు సాధించే అపరాల సాగు ఈ ఏడాది ఆశాజనకంగా ఉంది. రైతులు పండించిన మినుము, పెసర పంటలకు మార్కెట్‌లో ఆశించిన ధర లభిస్తోంది. నియోజకర్గంలో అపరాల సాగు ప్రారంభంనుంచి వాతావరణం అనుకూలంగా ఉండడంతో మంచి దిగుబడులు వచ్చాయి. పైరుపై తెగుళ్ల ప్రభావం పెద్దగా లేకపోవడంతో రైతులు సాధారణ పెట్టుబడితో మంచి ఫలితాలు సాధిస్తున్నారు. రేగడి భూముల్లో ఎకరాకు నాలుగు నుంచి ఐదు బస్తాల దిగుబడి వస్తే, మెట్ట ప్రాంతంలో రెండు నుంచి మూడు బస్తాల వరకూ దిగుబడులు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు రైతులు అపరాలను విక్రయిస్తున్నారు.

10,318 ఎకరాల్లో పెసర సాగు

తుని వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో ఈ ఏడాది రబీలో 10,318 ఎకరాల్లో పెసర, 9,785 ఎకరాల్లో మినుము సాగు చేశారు. వ్యవసాయాధికారులు పంట కోత ప్రయోగాల ద్వారా ఎకరానికి రెండు నుంచి ఐదు బస్తాల వరకూ దిగుబడి వస్తున్నట్లు గుర్తించారు. ఇప్పటికే రైతులు 90 శాతం పంటను ఒబ్బిడి చేసుకున్నారు. ఆలస్యంగా కోతకొచ్చిన 10 శాతం పంట దిగుబడిని ఒబ్బిడి చేసుకునే పనిలో ప్రస్తుతం రైతులు నిమగ్నమయ్యారు.

రైతులకు కనీస మద్దతు ధర

రైతులు రబీలో సాగు చేసిన అపరాలకు మార్కెట్‌లో కనీస మద్దతు ధర లభిస్తుంది. గతంలో దళారి చెప్పిందే వేదం. అతను నిర్ణయించిందే ధర. దళారుల మాటకు కట్టుబడే రైతులు అపరాలు అమ్ముకోవాల్సి వచ్చేది. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. దళారుల ఆగడాలకు ప్రభుత్వం కళ్లెం వేసింది. రైతుల వ్యయ ప్రయాసలకు అనుగుణంగా పెసరకు రూ.8,800, మినుముకు రూ.8000 చొప్పున కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)గా ప్రభుత్వం నిర్ణయించింది.



అపరాల సాగులో పంటకోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

కాగా మార్కెట్లో ప్రస్తుతం పెసర రూ.7,900, మినుము రూ.7,700 పలుకుతోంది.

ఉరుకులు, పరుగులు

అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా మెట్ట ప్రాంతంలో వాతావరణం మారింది. పలు గ్రామాల్లో కొద్దిపాటి వర్షం కురవడంతో అపరాల సాగు చేసిన రైతులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. కొంతమంది రైతులు పొలాల్లో ఉన్న పంటను ఒబ్బిడి చేస్తుండగా మరికొంత మంది ఒబ్బిడి చేసిన పంటను సురక్షిత ప్రాంతాలకు చేరుస్తున్నారు. అల్పపీడనం ప్రభావంతో వర్షం పడే అవకాశం ఉందని వాతావరణశాఖ ముందస్తుగా తెలియజేయడంతో రైతులు అప్రమత్తమయ్యారు. ఆదరాబాదరాగా పంటను ఒబ్బిడి చేసుకుంటున్నారు.

ధర బాగుంది



అపరాల సాగుకు వాతావరణం అనుకూలించడంతో ఈ ఏడాది దిగుబడులు బాగున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో మినుము, పెసర పంటలకు ధర కూడా ఆశాజనకంగానే ఉంది. ప్రభుత్వ చర్యలతో వ్యాపారుల దోపిడీ లేకుండా పోయింది. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే వ్యాపారులు అపరాలు కొనుగోలు చేస్తున్నారు. అపరాల సాగుతో రైతులకు అదనపు ఆదాయం వస్తోంది.

– అప్పలనాయుడు, రైతు, చిన్నయ్యపాలెం

తుని సబ్ డివిజన్ పరిధిలో అపరాల సాగు వివరాలు

మండలం	పెసర(ఎకరాల్లో)	మినుము(ఎకరాల్లో)
తొండంగి	6042	3,235
కోటనందూరు	1830	2,255
శంఖవరం	343	590
రౌతులపూడి	425	2,528
తుని	1,678	1,178
మొత్తం	10,318	9,786

అక్రమ తవ్వకాలు అడ్డుకోవాలంటూ ఆందోళన

- అచ్యుతాపురంలో లారీలను అడ్డుకున్న గ్రామస్తులు



ధనం మెట్ట వద్ద లారీలను అడ్డుకుని ఆందోళన చేస్తున్న అచ్యుతాపురం గ్రామస్తులు

గోకవరం: మండలంలోని అచ్యుతాపురంలో ధనం మెట్టపై అక్రమ మైనింగ్ తవ్వకాలను అడ్డుకోవాలని కోరుతూ గ్రామస్తులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. అనుమతులు లేకుండా అక్రమంగా మైనింగ్ చేపడుతున్నారన్నారని ఆరోపిస్తూ ఎంపీటీసీ మాజీ సభ్యుడు నల్లల వెంకన్నబాబు ఆధ్వర్యంలో మట్టి తరలిస్తున్న లారీలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనం మెట్టపై గత రెండేళ్లుగా అక్రమంగా మైనింగ్ జరుగుతోందన్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా పదుల సంఖ్యలో లారీలతో మట్టిని తరలిస్తున్నారన్నారు. లారీలు మితిమీరిన వేగంతో వెళ్లడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మెట్టపై ఉన్న భారీ చెట్లను నరికి వేయడంతో పర్యావరణం దెబ్బతింటోందన్నారు. భారీ లారీల రాకపోకలతో పోలవరం, పుష్కర కాలువ వంతెనలు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. మట్టి అక్రమ తవ్వకాలపై అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజాప్రతినిధులు ఎవరూ దీనిపై కల్పించుకునే అవకాశం లేదని, అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వేంకటేశ్వరస్వామికి 'తోట' పూజలు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని శుక్రవారం వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకుడు పాడుగు ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తోట నరసింహం వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం జీయ్యన్న సమాధిని దర్శించుకున్నారు. ఆయనకు పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఆయన వెంట జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిణ్ని వీరబాబు, పార్టీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షులు పెద్దాడ రాజుబాబు, డీసీఎంఎస్ రామకుర్తి మూర్తి, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ గఫూర్, ఎంపీటీసీ చెల్లూరి రాంబాబు, సర్పంచులు పోకల సుబ్బు, ములంపాక సురేష్ తదితరులు ఉన్నారు.



తాళ్లూరులో జీయన్న సమాధి వద్ద పూజలు చేస్తున్న తోట నరసింహం

జగన్‌తోనే పేదల సంక్షేమం



రంపయర్రంపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న తోట రాంజీ

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట అభ్యర్థి తోట నరసింహం తనయుడు తోట రాంజీ
- రంపయర్రంపాలెంలో ఎన్నికల ప్రచారం

గోకవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదల సంక్షేమం సాధ్యమని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు తోట రాంజీ అన్నారు. మండలంలోని రంపయర్రంపాలెంలో మూడో రోజు శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి గత ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో తన తండ్రి తోట నరసింహాన్ని జగ్గంపేట ఎమ్మెల్యేగా, చలమలశెట్టి సునీల్‌ను కాకినాడ ఎంపీగా గెలిపించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలన్నా, సుపరిపాలన కొనసాగాలన్నా వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, సుంకర వీరబాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, సొసైటీ చైర్మన్ దాసరి చినబాబు, ఉప సర్పంచ్ దాకారపు ధర్మరాజు, సమ్మెటి నాని, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉపాధి పనులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ కుమార స్వామి



గోకవరం మండలంలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న జిల్లా అంబుడ్స్‌మన్ షేక్‌ఖాదర్ బాషా

ప్రత్తిపాడు రూరల్: గ్రామాల్లో అర్హులైన ప్రతిఒక్కరికీ ఉపాధి హామీ పనులు కల్పిస్తున్నట్లు ఉపాధి ఏపీఓ కుమారస్వామి తెలిపారు. మండలంలోని వంతాడలో ఉపాధి హామీ కూలీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా ఉపాధి హామీ పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. మొత్తం 3,200 మందికి ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు వివరించారు. ఇప్పటివరకూ చేసిన పనులకు వచ్చే నెల మొదటి వారంలో వేతన సొమ్ములు జమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ టీఏ కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

గోకవరం: మండల పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఉపాధి హామీ పథకం జిల్లా అంబుడ్స్‌మన్ షేక ఖాదర్‌బాషా శుక్రవారం పరిశీలించారు. అచ్యుతాపురం పంచాయతీ పరిధిలోని పేరంటాల చెరువు, కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని పెదపాత్రుని చెరువు, గోకవరం పంచాయతీ పరిధిలోని మెరకరాజు చెరువు పనులను తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో ఉపాధి సిబ్బందికి కల్పించిన మౌలిక వసతులైన తాగునీరు, మందుల కిట్లు, పని ప్రదేశంలో షెడ్లు వంటివి పరిశీలించారు. వేసవి కాలం సమీపిస్తున్నందున వేతనదారులు వడదెబ్బ బారిన పడకుండా ఉదయమే పనులు కల్పించి రోజుకు సగటు వేతనం రూ.272 పొందే విధంగా పనులు కల్పించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఏపీఓ శేషఅప్పలరాజు, జేఈ రత్నరాజు, ఇతర సిబ్బంది ఉన్నారు.

గీతాంజలి కుటుంబ సభ్యులకు భరోసా

సామర్లకోట: గీతాంజలి కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి మడికి సోనియా కలిసి భరోసా ఇచ్చారు. గీతాంజలిపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టింగ్‌లు పెట్టడంతో తెనాలిలో ఆమె ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. శుక్రవారం సోనియా స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఒక హైకోర్టు మహిళా న్యాయవాదిగా, సైకాలజిస్టుగా గీతాంజలి కుటుంబ సభ్యులను కలిసి సానుభూతి తెలియజేసినట్లు తెలిపారు. గీతాంజలి ఇద్దరు కుమార్తెలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవడానికి ముందుకు వచ్చిందని ఆమె చెప్పారు. గీతాంజలి భర్తకు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ సేవా సంస్థ ద్వారా తగిన సహాయం చేయడానికి సోనియా చర్యలు తీసుకున్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ఓటు వేయండి

- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- బంగారయ్యపేట, కోడూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



బంగారయ్యపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వరుపుల సుబ్బారావు

రౌతులపూడి: గత ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓటు వేయాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని బంగారయ్యపేట, కోడూరు గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు, మహిళలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికల హామీలను నూరుశాతం అమలు చేశారన్నారు. నాడు–నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. ప్రతి పేదవాడికి వైద్యం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఆరోగ్యశ్రీ వైద్య ఖర్చుల పరిమితిని రూ.25 లక్షలకు పెంచారన్నారు. గ్రామాల్లోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలను అత్యాధునిక పరికరాలతో అభివృద్ధి చేసినట్టు చెప్పారు. పేదలు, అక్కచెల్లెమ్మలకు అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. భవిష్యత్ మరిన్ని సంక్షేమ పథకాలు పొందాలంటే మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, వైఎస్సార్ సీపీ నేత వాసిరెడ్డి జమీలు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలుపర్తి తాతాజీ, గ్రామ సర్పంచ్ మాదాసు దొంగబాబు, ఎంపీటీసీ సభ్యుడు గాది రాజుబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి చిట్టిబాబు, సొసైటీ ప్రెసిడెంట్ రుత్తల సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు వేదుల శర్మ, సుధీర్, ఫణి శర్మ, చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. దేవస్థానం సూపరింటిండెంట్ ఐవీ రామారావుతో పాటు 25 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్షకుంకుమార్చన

ప్రధానాలయంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండదిగువ కనకదుర్గ అమ్మవారికి ఆలయ అర్చకుడు కంచిబట్ల సాయిరామ్ ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

ఆలయానికి నూతన ఉత్సవ విగ్రహాల సమర్పణ



ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

పిఠాపురం: స్థానిక కొత్తగూడెంలో వేంచేసిన పట్టాభి రామాలయానికి శుక్రవారం దాతలు నూతన ఉత్సవ విగ్రహాలను బహూకరించినట్లు ఆంధ్రప్రదేశ్ శ్రీరామ హిందూ ఆధ్యాత్మిక సమాజ సేవా సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు విజయ జనార్దనాచార్యులు తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన దాత ధనంజయరాజు, నాగరాజశేష ఆనంద సీతాదేవి దంపతులు విగ్రహాలను అందజేయగా ప్రత్యేక పూజల నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ జనార్దనాచార్యులు మాట్లాడుతూ సమాజ సేవా కార్యక్రమాల కోసం ఏర్పడిన సంఘం ద్వారా చిన్న ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే పలు సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సీతారామం, ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, పి.సత్యనారాయణ, ట్రెజరర్ వాసు, సలహా దారులు వీరబాబు, అప్పలరాజ బాబు, నాని తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం పంచామృతాభిషేకం, బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు విశేష ప్రజాదరణ

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- జి.కొత్తపల్లిలో ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వరుపుల సుబ్బారావు

శంఖవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో వైస్ ఎంపీపీ ఈగల చిన్నమ్ములు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఈగల అప్పారావు ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మీయత సమావేశం నిర్వహించారు. వరుపుల సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కష్టించి పని చేయాలన్నారు. పార్టీ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజుబాబు, పార్టీ మండల కన్వీనర్ నరాల శ్రీను, సర్పంచులు శెట్టిబత్తుల కుమార్‌రాజా, సకురు గుర్రాజు, ఎంపీటీసీ దడాల సతీష్, వైఎస్సార్ సీపీ నాయకులు పర్వత వివేక్, దూడల శివ, గింజాల కొండబాబు, కొండపల్లి అప్పారావు, ఈగల రాజు, కోన బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర పోలీసు బలగాల కవాతు



కిర్లంపూడిలో ఎన్నికల నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కిర్లంపూడి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం కేంద్ర సాయుధ పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. మండలంలోని కిర్లంపూడి, రాజుపాలెం, వీరవరం గ్రామాల్లో ఏఆర్ అడిషనల్ డీఎస్పీ సత్యనారాయణ, జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, ఎస్సై షేక్ జబీర్ ఆధ్వర్యంలో పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించి ప్రజలకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతిఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రజలందరికీ ప్రశాంత ఎన్నికలపై భరోసా కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.